

హైదరాబాద్‌లో స్పీకర్ కిరణ్‌కుమార్ రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న తెదేపా శాసనసభ్యులు

# కాంగ్రెస్ ఏం చేసినా విచారణేది?

- సిగ్గులేని ప్రభుత్వాన్ని మీరైనా ఆదేశించండి
- స్పీకర్‌కు తెదేపా శాసనసభాపక్షం విజ్ఞప్తి

హైదరాబాద్, న్యూస్‌టుడే: కొవ్వూరు ఎమ్మెల్యే టీవీ రామారావుది అతని సొంత సమస్య కాదని, రాష్ట్రంలోని దళితులందరి ఆత్మగౌరవ సమస్య అని తెదేపా శాసనసభాపక్షం పేర్కొంది. ఏమీ జరగకున్నా సీబీసీఐడీ విచారణ వేయడం ప్రభుత్వ కక్ష సాధింపు వైఖరికి నిదర్శనమని విమర్శించింది. సిగ్గులేని ఈ ప్రభుత్వాన్ని కనీసం స్పీకర్ అయినా ఆదేశించాలని, దళిత శాసనసభ్యుడిపై జరుగుతున్న దాడిని అడ్డుకోవాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు తెదేపా శాసనసభాపక్ష బృందం శుక్రవారం శాసనసభ స్పీకర్ కిరణ్‌కుమార్‌రెడ్డికి ఓ వినతి పత్రం సమర్పించింది. విచారణ నివేదిక తెప్పిస్తానని, దానిని పరిశీలించి అనంతరం అవసరమైనంత మేరకు స్పందిస్తానని స్పీకర్ తెదేపా సభ్యులకు హామీ ఇచ్చారు. తాను హైదరాబాద్‌లో లేనని, లేకుంటే రామారావును పరామర్శించేవాడినని తెలిపారు. అనంతరం తెదేపా శాసనసభాపక్ష నేతలు విలేఖరులతో మాట్లాడారు. మంత్రి శిల్పా మోహన్‌రెడ్డి అసైన్డ్ భూములను ఆక్రమించారంటూ వినియోగదారుల ఫోరం జరిమానా విధించిందని, పీసీసీ అధ్యక్షుడు డీఎస్ కళాశాలలో హత్యాయత్నాలు జరిగాయని, వాటిపై ఒక్క ముక్కైనా మాట్లాడని వైఎస్.. దళిత ఎమ్మెల్యే రామారావుపై చేయని నేరాన్ని మోపి సీబీసీఐడీ విచారణకు ఆదేశించడం ఆయన దళిత వ్యతిరేక నైజాన్ని స్పష్టం చేస్తోందని దుయ్యబట్టారు.